ఏరియా ఆసుపత్రి అభివృద్ధికి కృషి

గోల్కొండ: గోల్కొండ ఏరియా ఆసుపత్రిని నగరంలోనే నెంబర్ వన్ ప్రభుత్వ ఆసుపత్రిగా మార్చడానికి కృషి చేస్తున్నానని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన గొల్కొండ ఏరియా ఆసుపత్రిలో కొత్తగా మంజూరైన రెండు అంబులెన్స్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత అసెంబ్లీ సమావేశాల్లో గోల్కొండ ఏరియా ఆసుపత్రి విషయం తాను లేవనెత్తానని దీనిపై రాష్ట్ర మంత్రి హరీష్‌రావు స్పందిస్తూ ఆసుపత్రి అభివృద్ధికి 8 కోట్ల రూపాయలు కేటాయిస్తానని హామీ ఇచ్చారన్నారు. అయితే ఆ నిధులు ఇప్పటి వరకు మంజూరు కాలేదని ఈ అసెంబ్లీ సమావేశాల్లో మంత్రి హరీష్‌రావును కలిసి ఆ నిధులు మంజూరయ్యేలా చూస్తానని ఆయన అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, ఆరూన్‌ఫర్హాన్, ఆసుపత్రి సూపరింటెండెంట్ మజర్‌ఉల్లా తదితరులు పాల్గొన్నారు.



కొత్త అంబులెన్స్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కౌసర్

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు



చార్మినార్: విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని చార్మినార్ సీబీడీ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. ఖిల్వత్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, దూద్‌బౌలి ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు, గౌసియా మసీదు, హసన్‌నగర్, వీకర్ సెక్షన్ కాలనీ, అత్తాపూర్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ పరిధిలో...

విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఫలక్‌నుమా సీబీడీ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. వట్టెపల్లి, గుంతల్‌షా దర్గా, రంజన్ కాలనీ, కాలాపత్తర్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, రహమత్‌నగర్, అన్సారీ రోడ్డు, తాడ్‌బన్, అంజదుల్లాబాగ్ ఫీడర్ల పరిధిలోని వేర్వేరు మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు, మీరాలం వాటర్ వర్క్స్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో సాయంత్రం 4 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

ఆస్మాన్‌ఘడ్ సీబీడీ ఏడీఈ పరిధిలో...

విద్యుత్ మరమ్మతుల కారణంగా శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆస్మాన్‌ఘడ్ సీబీడీ ఏడీఈ ఒక ప్రకటనలో తెలిపారు. నూర్‌ఖాన్‌బజార్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

అఫ్జల్‌గంజ్: 11 కేవీ పురానాపూల్ ఓవర్‌హెడ్, పురానాపూల్ అండర్‌గ్రౌండ్ విద్యుత్ ఫీడర్ల పరిధిలోని జుమ్మేరాత్‌బజార్, ఎంసీహెచ్ కార్యాలయం, సీత్లామాతా దేవాలయం, భూలక్ష్మి దేవాలయం, బాపూజీ నగర్, మార్వాడీ పాఠశాల, నగర్ ఖానా, లేబర్ అడ్డా, సేవాదళ్ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరాఫరాను నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు ఒక ప్రకటన ద్వారా తెలిపారు. అలాగే 11 కే.వి బేగం బజార్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని దీపా నర్సింగ్ హోం, బేగం బజార్, చేపల మార్కెట్, స్వాస్తిక్ మిర్చి తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 గంటల నుండి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

యూజీసీ గెజిట్ నిర్ణయంపై పలువురి హర్షం

చార్మినార్: ఇటీవలే 2022 సంవత్సరం నుండి అఖిల భారతీయ రాష్ట్రీయ షైక్స్ సిక్ మహా సంఘ్ (ఏబీఆర్‌ఎస్‌ఎం)ల నిరంతర వినతిపత్రాలతో యుజీసీ రెగ్యులేషన్స్ పాత పద్ధతిలోనే ''క్యారీయర్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్'' (సీఎఎస్) ప్రమోషన్స్ పాత విధానాన్నే కొనసాగించాలని యుజీసీ గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడం పట్ల ఎబీఆర్ ఎస్‌ఎం తెలంగాణ శాఖ అధ్యక్షులు ప్రొఫెసర్ ఎన్.కిషన్, కార్యదర్శులు డాక్టర్ ఏలూరి యాదయ్య, జగన్, సహాయ కార్యదర్శి, టీజీసీజీటీఏ అధ్యక్షులు డాక్టర్ భాస్కర్ ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. పాత యుజీసీ రెగ్యూలేషన్స్ కోసం తాము అనేక మార్లు యుజీసీ చైర్మన్, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌లకు స్వయంగా కలిసి వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. స్పందించిన గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడం పట్ల వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ గెజిట్‌తో యూనివర్సిటీ, డిగ్రీ కళాశాలల లెక్చరర్స్ పదోన్నతులు పొందుతున్నారన్నారు. ఇంకా ఈ తమ సర్వీసు మ్యాటర్ అంశంపై సానుకూలంగా స్పందించాలని వారు కేంద్ర విద్యాశాఖ మంత్రి, యుజీసీ చైర్మన్ ప్రొఫెసర్ జగదీష్ కుమార్‌ను కోరారు. ఇతర సర్వీసు అంశాలపై త్వరలో ఢిల్లీ పర్యటన చేస్తామన్నారు. ఎబీఆర్‌ఎస్‌ఎం జాతీయ జాయింట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గుంత లక్ష్మణ్‌జీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పోలీసుల బైక్ ర్యాలీ

సంతోష్‌నగర్: శాంతి భద్రతల పరిరక్షణకు, ప్రజలకు తాము ఉన్నామంటూ భరోసా కల్పించేందుకు గురువారం రాత్రి కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోలీసులు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు పలు ప్రాంతాల్లో బైక్‌లపై ర్యాలీ నిర్వహించారు. ఉమర్ హోటల్ నుండి ప్రారంభమైన ఈ ర్యాలీ హఫీజ్‌బాబానగర్, ఎ.బీ, సీ,డీ బ్లాక్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. విజిబుల్ ఫ్రెండ్లీ పోలీసింగ్‌లో భాగంగా ప్రజలకు మేమున్నామంటూ భరోసా కల్పించేందుకు, ప్రజలు నేరుగా స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదులు చేయడానికి ఈ ర్యాలీను నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న కంచన్‌బాగ్ ఇన్‌స్పెక్టర్ శేఖర్ రెడ్డి, ఎస్సైలు, సిబ్బంది

అసెంబ్లీ ముట్టడికి యత్నం



మెట్టు సాయికుమార్‌ను అరెస్టు చేస్తున్న పోలీసులు

నాంపల్లి: వరద ముంపు ప్రాంతాల్లో సహాయ చర్యలు చేపట్టాలని కోరుతూ టీపీసీసీ ఫిషర్‌మెన్ విభాగం నాయకులు, కార్యకర్తలు శుక్రవారం అసెంబ్లీ ముట్టడికి బయలుదేరగా అసెంబ్లీ గేటు వద్ద పోలీసులు అరెస్టు చేసి అక్కడి నుంచి తరలించారు. ఫిషర్‌మెన్ విభాగం చైర్మన్ మెట్టు సాయికుమార్ నేతృత్వంలో కాంగ్రెస్ కార్యకర్తలు అసెంబ్లీ ముట్టడికి యత్నించారు. ఈ సందర్భంగా మెట్టు సాయి కుమార్ మాట్లాడుతూ... వరదల్లో చనిపోయిన వారి కుటుంబాలకు రూ.50 లక్షలు పరిహారంతో పాటు ఇండ్లు కోల్పోయిన బాధితులకు రూ.20 లక్షల ప్రకటించాలని డిమాండ్ చేశారు.

సివరేజీ పనులు ప్రారంభం

జియాగూడ: పురానాపూల్ ఇక్బాల్‌గంజ్‌లో సివరేజి పైప్‌లైన్ నిర్మాణం పనుల ద్వారా సమస్య పరిష్కారం అవుతుందని జియాగూడ కార్పొరేటర్ బోయిని దర్శన్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం వాటర్‌వర్క్స్ ద్వారా సివరేజీ పైప్‌లైన్ నిర్మాణం పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో డివిజన్ బీజేపీ ఎస్సీమోర్చ ఉపాధ్యక్షులు గోల్కొండ జిల్లా బీజేవైఎం అధికార ప్రతినిధి మనీష్‌జైన్ తదితరులు పాల్గొన్నారు.

కవులు, కళాకారులకు గుర్తింపు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కవులు, కళాకారులకు పెద్దపీట వేస్తుందని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్తా అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో కనకదుర్గ నృత్య విభావరి 41వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం ఆయన మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత మరుగున పడినటువంటి కళలను గుర్తించి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కథక్ కళాక్షేత్రం డైరెక్టర్ పండిట్ అంజిబాబు, జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ చైర్మన్ గుదిబండి వెంకట్‌రెడ్డి, తెలుగు విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ వనజ ఉదయ్, కళ పత్రిక సంపాదకులు మహ్మద్ రఫీ, సంస్థ అధ్యక్షురాలు లయన్ నిర్మల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



కళాకారులతో ఉప్పల శ్రీనివాస్ గుప్తా తదితరులు

వరద బాధితులకు చేయూత



నిత్యావసర సరుకుల కిట్లతో బాస్ అధ్యక్షుడు క్యాతం రాధాకృష్ణ, రాకేష్, విజయ్ భాస్కర్

అఫ్జల్‌గంజ్: ఇటీవల కురిసిన భారీ వర్షాలతో కూడిన వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన బాధితులను ఆదుకోవాలని భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి (బాస్) అధ్యక్షుడు క్యాతం రాధాకృష్ణ అన్నారు. శుక్రవారం ఉస్మాన్‌గంజ్‌లోని కేంద్రా కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... ములుగు జిల్లా మేడారం వద్ద వర్షాల వల్ల సర్వస్వం కోల్పోయిన దాదాపు 200 కుటుంబాల చేయుతకు సంకల్పించారు. సంస్థ సభ్యులు, దాతల సహకారంతో సేకరించిన నిత్యావసర సరుకులతో కూడిన వాహనంలో సంస్థ కార్యాలయం నుండి మేడారానికి బయలుదేరి వెళ్లారు.

పని చేసే వారికే గుర్తింపు

గోల్కొండ: పని చేసే వారికి గుర్తింపు లభిస్తుందని గొల్కొండ ఇన్‌స్పెక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. గొల్కొండ పీస్, మైత్రి కమిటీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ ఫ్యామిలీ కౌన్సిల్ ఆర్గనైజేషన్ చైర్మన్ మహ్మద్ నజీబ్‌కు ఆయన శుక్రవారం ప్రశంసా పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీస్ అండ్ మైత్రి కమిటి వారు గోల్కొండ కోట బోనాలు శాంతియుతంగా నిర్వహించడంలో ప్రశంసనీయమైన సేవలు అందించారని ఆయన అన్నారు. బోనాల పండుగలే కాకుండా గణేష్ ఉత్సవాలు, మోహర్రం, రంజాన్, బక్రీద్ పండుగల సందర్భంలో కూడా పీస్‌అండ్ మైత్రి సభ్యులు పోలీసులకు సహకరిస్తుంటారని ఆయన అన్నారు.



మహ్మద్ నజీబ్‌కు ప్రశంసా పత్రాన్ని అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు

దివ్యాంగులకు కృత్రిమ అవయవాల పంపిణీ

సుల్తాన్‌బజార్: దివ్యాంగులు దేవుడితో సమానమని భావిస్తూ గత 25 సంవత్సరాలుగా శ్రీ గురుదేవా ఛారిటబుల్ ట్రస్ట్ లక్షలాది మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందించడం అభినందనీయమని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. శుక్రవారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ లో గురుదేవా చారిటబుల్ ట్రస్ట్ పేద దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు, సంస్థ మాజీ డైరెక్టర్ మల్లారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గవర్నర్ దత్తాత్రేయ, సెంట్రల్ విజిలెన్స్ కమీషనర్ కెవి.చౌదరి, వ్యవస్థాపక అధ్యక్షులు మాట్లాడారు. ఈ సందర్భంగా జర్నలిస్టు శంకర్ నారాయణ రచించిన వాల్మీకి శతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ..ఇప్పటివరకు సేవా సంస్థ సహకారంతో దాదాపు 142 మంది దివ్యాంగులకు ఉచితంగా కృత్రిమ అవయవాలు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. గన్‌ఫౌండ్రీ కార్పొరేటర్ సురేఖ ఓంప్రకాష్, విశ్వేశ్వర్, ప్రతినిధి సుబ్బారావు, యుపిఎస్సీ ఫ్యాకల్టి మెంబర్ మాధురి, ఇతర ట్రస్టు సభ్యులు, దివ్యాంగులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అందజేస్తున్న హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ

గో ఉత్పత్తులను పెంపొందించేందుకు కృషి



అబిడ్స్: గో ఉత్పత్తులను పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ జాతీయ సీనియర్ నాయకులు పి.మురళీధర్‌రావు పేర్కొన్నారు. గో సంతతిని పెంపొందించేందుకు అందరూ ముందుకు రావాలన్నారు. శుక్రవారం జాలారామ్ బాబా ఆలయంలో గో రక్ష సంకల్ప్ సమ్మేళనంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆర్గానిక్ వ్యవసాయాన్ని మరింత అభివృద్ధి చేయాలన్నారు. కార్యక్రమంలో అనిల్ బజాజ్, ఆనంద్ తివారి, సంతోష్ ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

చోరీ కేసులో నిందితుడికి 5 నెలల జైలు

అబిడ్స్: ఓ చోరీ కేసులో నిందితుడికి 5 నెలల జైలు శిక్ష విధించారు. మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్ ఎ.రవి కుమార్ తెలిపిన మేరకు.. మల్లెపల్లి అఫ్జల్‌సాగర్‌కు చెందిన కాంబ్లే సాయిబాబ(20) బైకుల చోరీలకు పాల్పడుతూ మంగళ్‌హాట్ పోలీసులకు చిక్కాడు. నిందితుడిని అరెస్టు చేసిన పోలీసులు కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేసి సాక్ష్యాధారాలు సమర్పించారు. దీంతో నాంపల్లిలోని 16 అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ నిందితుడికి 5 నెలల జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ కేసులో పీపీగా అరవింద్‌కుమార్, కేసు దర్యాప్తులో ఎస్‌ఐ.కె.రాజులు వ్యవహరించారు.

ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణ

అబిడ్స్: స్థానిక ప్రజల సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రత్యేక కృషి చేస్తానని మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ.రవికుమార్ పేర్కొన్నారు. నూతనంగా పదవీబాధ్యతలు స్వీకరించిన ఆయనను ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ ఉపాధ్యక్షులు, రహీంపురా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, మాడిశెట్టి సదానందం గుప్తా, వైశ్య సంఘం నాయకులు బి.రామస్వామిగుప్తాలతో పాటు లక్ష్మీనారాయణ, జె.పాండులు ఘనంగా సత్కారం చేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ రవికుమార్ మాట్లాడుతూ.... స్టేషన్ పరిధిలోని అన్ని ప్రాంతాల్లో ఫ్రెండ్లీ పోలీసింగ్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తామన్నారు. అసాంఘిక శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తారమని హెచ్చరించారు. కార్యక్రమంలో మహాశివరాత్రి జాగరణ సమితి నాయకులు, స్థానికులు టి.రాజు, సురేందర్ సింగ్, లక్ష్మీనారాయణ, జె.పాండు, రాజేందర్ సింగ్, బికె.సింగ్, డిఎల్‌ఎస్.వర్మ, నరేష్ గుప్తా, గోపాల్‌సింగ్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.



నూతన ఇన్‌స్పెక్టర్‌ను సత్కరిస్తున్న మాడిశెట్టి సదానందం గుప్తా, డి.రామస్వామిగుప్తా

సుప్రీంకోర్టులో ఊరట లభించడంపై హర్షం



రేతిబౌలి వద్ద కాంగ్రెస్ నాయకుల సంబరాలు



సంబరాల్లో పాల్గొన్న కె.వెంకటేశ్

చార్మినార్: రాహుల్‌గాంధీకి అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టులో ఊరట లభించడం పట్ల తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శి జి.కన్నయ్యలాల్ హర్షం ప్రకటించారు. న్యాయవ్యవస్థలో ఇది ఒక గొప్ప విజయమని... వ్యవస్థలో ఒక నమ్మకం ఉందని.. కుట్రలు, కుతంత్రాలు చేసిన వారికి ఇది సరైన సమాధానం అన్నారు. రాహుల్ గాంధీ తిరిగి పార్లమెంట్‌లో పాల్గొని దేశ విషయాలను విస్తారంగా చర్చిస్తారన్నారు. ప్రజా సమస్యలను పార్లమెంట్ దృష్టికి తీసుకొని వస్తారని బీజేపీ ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక పనుల పట్ల కాంగ్రెస్ పార్టీ రాహుల్‌గాంధీ ఆధ్వర్యంలో బీజేపీ ప్రభుత్వాన్ని నిలదీస్తుందని కన్నయ్యలాల్ అన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తల సంబరాలు

గోల్కొండ: లోక్‌సభ సభ్యత్వంపై సుప్రీంకోర్టు రాహుల్‌గాంధీకి అనుకూలంగా తీర్పును ఇస్తూ స్టే ఇవ్వడం న్యాయవ్యవస్థపైప్రజల నమ్మకాన్ని మరింత పెంచిందని సీనియర్ కాంగ్రెస్ నాయకులు కురకుల కృష్ణ అన్నారు. సుప్రీం కోర్టు తీర్పుపై ఆయన ఆధ్వర్యంలో శుక్రవారం రేతిబౌలి రింగ్‌రోడ్ వద్ద ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు టపాసులు కాల్చి, మిఠాయిలు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ కొన్ని రాష్ట్రాల్లో మాత్రం అధికారంలో ఉందని వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో కేంద్ర ప్రభుత్వంతో పాటు కొన్ని ఉత్తరాధి రాష్ట్రాలో బీజేపీ ఓడిపోవడం ఖాయమని ఆయన అన్నారు. చంటిబాబు, అమీద్‌ఖాన్, రవీందర్, చంద్రకాంత్ పాల్గొన్నారు.

గౌలిపురా: కాంగ్రెస్ ముఖ్యనేత రాహుల్‌గాంధీపై రెండేళ్ల పాటు విధించిన సూరత్ కోర్టు శిక్షపై సుప్రీం కోర్టు స్టే విధించడం పట్ల చార్మినార్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కె.వెంకటేశ్ హర్షం వ్యక్తం చేశారు. శుక్రవారం గాంధీభవన్‌లో రాహుల్‌గాంధీకి సుప్రీంకోర్టు స్టే విధించడం పట్ల సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ... లోక్‌సభలో ప్రజా సమస్యలపై మళ్లీ రాహుల్‌గాంధీ గళం విప్పి కేంద్ర ప్రభుత్వం లోపాలను ఎండగట్టడం ఖాయమన్నారు.

సంతాప సభ

చార్మినార్: తెలంగాణ వక్ఫ్ ట్రిబ్యూనల్ ఆధ్వర్యంలో వక్ఫ్ ట్రిబ్యూనల్ బార్ అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం మహ్మద్ వసీవుద్దీన్, మహ్మద్ గులాం హుస్సేన్‌ల సంతాప సభను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు జావేద్, న్యాయవాది, వక్ఫ్ ట్రిబ్యూనల్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఎజాజ్ అలీ ఖురేషిలు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఆసిఫ్, అహ్మద్, ముబీన్, అహ్మద్ అఫ్జల్ బియాబానీ, ఇద్రీస్ అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.



సంతాప సభలో పాల్గొన్న జావేద్, ఎజాజ్ అలీ ఖురేషిలు

జోరుగా భాగవత్ సప్త్ కలశయాత్ర

అబిడ్స్: ఉత్తరభారతీయులు భాగవత్ సప్త్ కలశయాత్ర చేపట్టారు. ఆధ్యాత్మిక గురువు శ్రీ అనిరుద్ దూనివాలే మహారాజ్ రథయాత్రలో పాల్గొనగా ఉత్తర భారతీయ మహిళలు తమ తలపై కలశాలను పెట్టుకుని యాత్ర కొనసాగించారు. బేగంబజార్‌లో ఈ కలశయాత్రను గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌ఛార్జ్ నందకిశోర్ వ్యాస్ బిలాల్, మహేష్ బ్యాంక్ చైర్మన్ రమేష్‌కుమార్ భంగ్‌లు ప్రారంభించి ఈ యాత్రలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నరేంద్రకుమార్, పప్పుమాత్రే, ప్రదీప్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



కలశయాత్రలో పాల్గొన్న నందకిశోర్ వ్యాస్ బిలాల్, మహేష్ బ్యాంక్ చైర్మన్ రమేష్‌కుమార్ భంగ్

వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఓటమి ఖాయం

గోల్కొండ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ప్రజలు చిత్తుగా ఓడించడం ఖాయమని బీజేపీ రాష్ట్ర నాయకులు దేవర శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం లక్ష్మినగర్ చౌరస్తా వద్ద జరిగిన బీజేపీ నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ప్రజాస్వామ్యం లేదని కేవలం నియంత పాలన సాగుతుందని అన్నారు. ముఖ్యమంత్రి కేసిఆర్ ఒంటెద్దు పోకడలతో తమ సొంత నిర్ణయాలను ప్రజలపై రుద్దుతున్నారని అన్నారు. అనంతరం బీజేపీ నాయకులు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన బండి సంజయ్‌కు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో నాయకులు నామ యాదగిరినేత, రాధాకిషన్‌యాదవ్, శ్రీకాంత్‌సాగర్ తదితరులున్నారు.



సమావేశంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు

ప్రజలకు పోలీసులపై నమ్మకం పెరిగింది

గోల్కొండ: తెలంగాణ పోలీసులు అవలంభిస్తున్న విధానాల వల్ల ప్రజలకు పోలీసులపై నమ్మకం బాగా పెరిగిందని గోల్కొండ జోన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. శుక్రవారం ఆయన గొల్కొండ పీస్ అండ్ మైత్రి కమిటి సభ్యుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోల్కొండ జోన్ ఏసీపీగా రావడం తనకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. గతం గోల్కొండ పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌వోగా పని చేసిన అనుభవం తనకు ఉందన్నారు. ఆ సమయంలో తనకు అందరితో పరిచయాలు ఉన్నాయని గత అనుభవంతోనే తాను గోల్కొండ జోన్‌లో నేరాల నియంత్రణ, శాంతిభద్రతలు కాపాడడానికి కృషి చేస్తానని అన్నారు. గోల్కొండ ఇన్‌స్పెక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు, పీస్ కమిటీ సభ్యులు రాజు వస్తాద్, ఇలియాస్ అక్బర్ పాల్గొన్నారు.



గోల్కొండ జోన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గురువులను గౌరవించాలి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అభినేత్రి ఆర్ట్స్ అకాడమి ఆధ్వర్యంలో పలువురు నృత్య గురువులను స్మరిస్తూ ప్రాణం పేరిట నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహుతులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ మాట్లాడుతూ..... గురువులను పూజించడం, గౌరవించడం వంటి లక్షణాలు కలిగి ఉండాలని అప్పుడే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకుంటామన్నారు. ప్రముఖ నృత్యగురువు మంజుల శ్రీనివాస్, సంస్థ అధ్యక్షులు ప్రమోద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శనలు

క్లుప్తంగా...

నేటి నుంచి విద్యుత్ కాంతుల్లో చార్మినార్

దూద్‌బౌలి: చారిత్రాత్మకమైన చార్మినార్ కట్టడం శనివారం విద్యుత్ కాంతుల మధ్య పర్యాటకులను కనువిందు చేయనుందని అధికారులు తెలిపారు. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ సహకారం అందించడంతో చారిత్రాత్మకమైన చార్మినార్ కట్టడానికి కొత్త కళ సంతరించుకోనుందన్నారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు శుక్రవారం చార్మినార్‌కు రంగు రంగుల విద్యుత్ దీపాలంకరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి హాజరై ప్రారంభించనున్నట్లు అధికారులు తెలిపారు.

మంగళ్‌హాట్ ఇన్‌స్పెక్టర్‌కు సత్కారం



రవికుమార్‌ను సత్కరిస్తున్న జి.వెంకటేష్

నాంపల్లి: నియోజకవర్గం కాంగ్రెస్ నేత జి.వెంకటేష్ నేతృత్వంలో పలువురు శుక్రవారం మంగళ్‌హాట్ పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎ.రవికుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాజ్‌కుమార్ సింగ్, గోరుభాయ్, శైలేష్ పాల్గొన్నారు.

నాంపల్లి తహసీల్దార్‌గా ప్రేమ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ



ప్రేమ్‌కుమార్‌కు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న వర్కల సత్యనారాయణ

నాంపల్లి: నాంపల్లి మండల తహసీల్దార్‌గా ప్రేమ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన తహసీల్దార్‌ను శుక్రవారం నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం హైదరాబాదు జిల్లా అధ్యక్షులు వర్కల సత్యనారాయణ నేతృత్వంలో పలువురు కార్యాలయం ఉద్యోగులు, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు.

గోషామహల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా కె.మహేష్ గౌడ్



అబిడ్స్: గోషామహల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా కె.మహేష్ గౌడ్ బాధ్యతలు స్వీకరించారు. గత కొంత కాలంగా ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన గురునాథ్ చంద్రాయణగుట్టకు బదిలీ కావడంతో రాచకొండ నుంచి మహేష్‌కుమార్ బదిలీపై వచ్చారు. గతంలో సైఫాబాద్ ట్రాఫిక్, మాదన్నపేట, రామ్‌గోపాల్‌పేట, సీసీఎస్, చాదర్‌ఘాట్ పోలీస్‌స్టేషన్లలో మహేష్‌గౌడ్ పనిచేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన మాట్లాడుతూ.... ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రత్యేక కృషి చేస్తానన్నారు. వాహనదారులందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా నిరంతరం స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తామన్నారు.

పీవీ రమణ రంగస్థల పురస్కారానికి దరఖాస్తులు ఆహ్వానం

నాంపల్లి: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రంగస్థల కళల శాఖ పీవీ రమణ పేరిట నెలకొల్పిన పీవీ రమణ రంగస్థల స్మారక పురస్కారాన్ని 2022-23వ సంవత్సరానికి గాను ఆగస్టు 17న ప్రదానం చేస్తున్నట్లు తెలుగు వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ ఒక ప్రకటలో తెలిపారు. రంగస్థల దర్శకత్వ రంగంలో అర్హులైన వారిని ఎంపిక చేసి స్మారక పురస్కారం అందజేస్తున్నట్లు వివరించారు. పురస్కారానికి అర్హులైన వారు ఈ నెల 11వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తమ దరఖాస్తులను పంపాల్సి ఉంటుందని తెలిపారు.

తప్పిపోయిన బాలిక కుటుంబ సభ్యులకు అప్పగింత



సంతోష్‌నగర్: ఇంట్లో నుంచి తప్పిపోయి రోడ్డుపై తిరుగుతున్న బాలికను సంతోష్‌నగర్ పోలీసులు శుక్రవారం క్షేమంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... భవానీనగర్ ప్రాంతానికి చెందిన మహ్మద్ జుబేర్ కూతురు ఆఫ్షియా బేగం గురువారం కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటికి వెళ్లి కనిపించకుండా పోయింది. దీంతో రోడ్డుపై తిరుగుతున్న బాలిక ఆఫ్షియాను గమనించిన సంతోష్‌నగర్ పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం వివరాలు సేకరించి తండ్రి మహ్మద్ జుబేర్‌ను పిలిపించి అప్పగించారు. పోలీసులు ఆఫ్షియా బేగంను అప్పగించడం పట్ల కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేస్తూ పోలీసులకు ధన్యవాదాలు తెలిపారు.